# కరాటే పోటీల్లో ప్రత్తిపాడు విద్యార్థులకు బంగారు పతకాలు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్,20:**యానాం రీజియన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రత్తిపాడు కరాటే స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచడమే కాకుండా బంగారు పతకాలు సాధించినట్లు కరాటే స్కూల్ మాస్టర్ పి బుజ్జి తెలిపారు. కాటా సీనియర్ విభాగంలో నిర్వహించిన ఈ ఛాంపియన్ షిప్ పోటీల్లో 15 మంది విద్యార్థులు బంగారు పథకాలు, ఇద్దరు విద్యార్థులు సిల్వర్ పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. విజేతలకు యానాం రీజియన్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు జి జయ రామారావు, కార్యదర్శి ఎం అరవింద వ్యాస్ తదితరులు పాల్గొని మెడల్స్ తో పాటు, ప్రశంసా పత్రాలను అందజేసినట్లు బుజ్జి ఈ సందర్భాగా తెలిపారు. విజేతలుగా బంగారు పథకాలు సాధించిన తమ స్కూల్ విద్యార్థులను స్కూల్ మాస్టర్ బుజ్జి ఈ సందర్భంగా అభినందించారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# త్రాగునీరు వృధా పట్టించు కోరా



**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 20;** విద్యుత్తు సరఫరా ఉంటేనే మంచినీరు వస్తాయి. విద్యుత్ సరఫరా ఎప్పుడైతే ఆగిపోయిందో మంచినీరు రాక ఆ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. అంకన్న గూడెం పంచాయతీ పూచికపాడు గ్రామంలో ఈ పరిస్థితి ఎప్పటినుండో కొనసాగుతుంది. ఆ గ్రామంలో చిన్న వాటర్ ట్యాంకు ఉంది. దాని నుండి మంచినీటి సరఫరా అంతంత మాత్రమే. అయితే జగన్నాధపురం గ్రామం నుండి పూ చికపాడు గ్రామానికి పైప్ లైన్ ద్వారా మంచినీరు సరఫరా అవుతుంది .ఈ పైపులైన్లలో లీకేజీలు ఉండే మంచినీరు కలుషితం అవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. మంచినీరు పైప్ లైన్ వద్ద అపరిశుభ్రత చోటు చేసుకోవడంతో అనారోగ్య పాలో అవుతున్నారు . మంచినీరు వృధాగా పోతుందని కార్క్ బిగిస్తే పైప్ లైన్లు పగిలిపోవడం సర్వసాధారణమని గ్రామస్తులు తెలుపుతున్నారు. శాశ్వతంగా మా గ్రామానికి మంచినీరు చక్రమంగా అందించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని మహిళలు, గ్రామస్తులు కోరుతున్నారు.



# సెప్టెంబర్ 21న యధావిధిగా పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

-- కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 20:**ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను సెప్టెంబర్ 21 సోమవారం జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో, మున్సిపల్, మండల స్థాయిలో సంబంధిత కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రభుత్వ కార్యాలయాల పని దినాల్లో కూడా అర్జీలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ లలో అర్జీల రూపంలో సమర్పించి పరిష్కారం పొందాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు క్షేత్రస్థాయిలోని తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, గ్రామ, వార్డు సచివాలయ కార్యాలయాల్లో కూడా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఆర్డీవోలు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాలకు నేరుగా వచ్చి అర్జీలు సమర్పించడంతో పాటు మీకోసం వెబ్‌సైట్ ద్వారా కూడా తమ సమస్యలను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు నమోదు చేయడంతో పాటు, వాటి ప్రస్తుత పరిష్కార స్థితిని కూడా తెలుసుకోవచ్చని సూచించారు. పీజీఆర్ఎస్-మీకోసం ద్వారా సేవలు పొందిన ఫిర్యాదుదారులు ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను నేరుగా ప్రభుత్వానికి తెలియజేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి కోరారు. ప్రజల నుంచి అందే అభిప్రాయాల ఆధారంగా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ గవర్నెన్స్ 9552300009 నంబర్ ద్వారా 300కు పైగా పౌర సేవలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ కీర్తి తెలిపారు. ప్రజలు తమకు అందుబాటులో ఉన్న వివిధ సేవా మార్గాలను సద్వినియోగం చేసుకుని సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు.

# ప్రజల ప్రాణాలకు ప్రమాద కారంగా మారిన కల్వర్టు





**నాలుగు నెలల్లో 20 మంది ప్రాణాలు బలి**


**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 20:**రాజమహేంద్రవరం నగరం నుండి ఎయిర్పోర్ట్ ప్రధాన రహదారి లో కోలమూరు గ్రామ శివారు గాడాల గ్రామం ప్రారంభంలో సుమారు నాలుగు నెలలుగా నిర్మాణం చేస్తున్న కల్వర్టు ప్రజల పాలిట బలిపీఠంగా మారింది. గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి 516 ఈ పేర్కొంటున్న ఈ రహదారి రాజమహేంద్రవరం నుంచి గోకవరం ,అడ్డతీగల, మీదుగా విజయనగరం చేరుతోంది. సుమారు 5 -6 సంవత్సరాల క్రితం నిర్మాణం చేసిన ఈ రహదారులో గాడాల గ్రామం వద్ద చెరువు, చాగల్నాడు ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పైపులైను వెళ్తోంది. ఈ రహదారి గామన్ బ్రిడ్జికి దగ్గరగా ఉండటం వల్ల క్వారీ, మట్టి, ఇసుక లారీలు పగల రాత్రి తేడా లేకుండా సైర విహారం చేస్తున్నాయి. గత ఐదారు సంవత్సరా లుగా భారీ వర్షాలు కురిసిన లేదా పైప్ లైన్ నుంచి నీరు లీకేజీలు జరిగి ఈ రహదారి మీదుగా నీరు పారడంతో మునిగిపోయి చెరువును తలపించేది. నిత్యం వాహనాలు ప్రమాదాల బారిన పడేవారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ పక్షాల నాయకులు, ప్రజా సంఘాలు, స్థానిక గ్రామాల ప్రజలు ముంపు బారి నుంచి కాపాడాలని, కల్వర్టు నిర్మించాలని ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేసిన మీదట ఎట్టకేలకు నాలుగు నెలల క్రితం కల్వర్టు నిర్మాణానికి పనులు చేపట్టారు. సంబంధిత అధికారులు, నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిబంధనల మేరకు ప్రామాణికమైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటూ ఈ రహదారి పై రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. రెండు నెలల క్రితం ఒకవైపు కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టగా, రెండో వైపున సింగిల్ రోడ్డుపై ఇరువైపులా రాకపోకలు సాగించేవి. నిర్మాణానికి సంబంధించి ఎటువంటి హెచ్చరిక బోర్డులు, గుర్తులు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ఏర్పాటు చేయకపోవడం వల్ల వాహనాలు ఢీకొనడం లేదా బోల్తా పడడం వంటి ఘటనల్లో చాలామంది వాహనదారులు తీవ్ర గాయాలు పాలవు తున్నారని గ్రామానికి చెందిన ప్రజా న్యాయ పోరాట సంఘం అధ్యక్షుడు పోసుపో యెహోషువ ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణం పనుల వల్ల దుమ్ము ధూళి లేచి రోడ్లపైన, గృహాల్లోను, వ్యాపార దుకాణాల్లోనూ పేరుకుపోతుందని, వాహనాల రాకపోకలకు కనిపించడం లేదని దాంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. నిర్మాణ పనులు జరుగుతున్నట్లు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం గానీ, దుమ్ము ధూళి పైకి లేచిపోకుండా నీటితో తడపడం గాని చేయడం లేదని పేర్కొన్నారు. పగలు పూట ప్రయాణాలు, వాహన రాకపోకలు ఎలా ఉన్నప్పటికీ, రాత్రి సమయాల్లో కల్వర్టు నిర్మాణం పనులు జరుగుతున్నట్లు వాహనదారులకు తెలియక పోవడం వల్ల వాహనాలు ఢీకొంటున్నాయని ప్రజలు, వాహనదారులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, తీవ్ర గాయాలు పాలవుతున్నారని వాపోయారు. గత నాలుగు నెలలలో ఎన్నో భారీ వాహనాలు, లారీలు ద్విచక్ర వాహనాలను, ఆటోలను ఢీకొనడంతో ప్రమాదాలు జరిగి సుమారు 20 మంది ప్రజలు మృత్యువాత పడ్డారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి టిప్పర్ లారీ వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్నీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడేక్కడే మృతి చెందాడని తెలిపారు. సంబంధిత నిర్మాణ కాంట్రాక్టర్కు, అధికారు లకు, పోలీసుల దృష్టికి తీసుకెళ్ళిన వారేమీ పట్టించుకోవడంలేదని వాపోయారు. నిర్మాణానికి సంబంధించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, దుమ్ము ధూళి పైకి లేవకుండా నీటితో తడపాలని , నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# శ్రీ భద్రావతి భావనా ఋషి ఆలయం వద్ద ఘనంగా అన్నసంతర్పణ



**తాళ్లపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 20:**తాళ్లపూడి గ్రామంలోని పద్మశాలీల వీధిలో ఉన్న శ్రీ భద్రావతి భావనా ఋషి ఆలయం వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించి, గణనాథునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆలయ నిర్వాహకులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గొప్ప అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నసంతర్పణలో భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తి వాతావరణంలో కొనసాగడంతో పద్మశాలీల వీధిలో పండుగ సందడి నెలకొంది. భక్తులు భక్తిశ్రద్ధలతో గణనాథుని సేవల్లో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# సీసీ రోడ్డు వేయాలని శాసనసభ్యులు గోరంట్లకు రైతులు వినతి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 20:**కడియం మండలం కడియపులంక గ్రామంలో నాబార్డ్ రోడ్డు నుండి సత్యదేవ నర్సరీ వరకు రోడ్డును సీసీ రోడ్డు వేయాలని స్థానిక రైతులు రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరిని కలిసి వినతి పత్రం అందించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ కడియం మండలంలో నర్సరీ రైతులు మొక్కలు ఎగుమతి చేసేందుకు భారీ వాహనాలు ప్రయాణిస్తు న్నాయన్నారు. కోట్లాది రూపాయల కేటాయించి సిసి రోడ్లు నిర్మిస్తున్నామని, నర్సరీ రైతుల కోరుతున్న ఈ రోడ్డును కూడా సీసీ రోడ్డు నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బోడపాటి గోపి, కడియం మండల జనసేన అధ్యక్షులు ముద్రగడ జమ్మి, గట్టి సుబ్బారావు, పాఠంశెట్టి రాంజీ, సత్తి వెంకటగిరి, బొరుసు శేషగిరి, పుల్ల ఆంజనేయులు, చెక్కపల్లి గోవింద్, మార్గాని కృష్ణ, పెనుమాక శ్రీను, పుల్ల పెద్ద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మఠం విజయభాస్కర్‌కు గౌరవ డాక్టరేట్

**గంగవరం /రాజవొమ్మంగి పెన్ పవర్, సెప్టెంబర్20:**పోలవరం జిల్లా రంపచోడవరం ఎస్టీ నియోజకవర్గం రాజవొమ్మంగి మండలం కింద్ర పంచాయతీ అనంతగిరి గ్రామానికి చెందిన మఠం విజయభాస్కర్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. దక్షిణాఫ్రికాలోని ఎపికైజో ప్రాఫెటిక్ బైబిల్ యూనివర్సిటీ సామాజిక సేవ, నాయకత్వ రంగాల్లో ఆయన అందించిన సేవలను గుర్తించి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో విజయభాస్కర్ ఈ గౌరవాన్ని అందుకున్నారు.
రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి భర్త అయిన విజయభాస్కర్ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలకు తన సొంత వాహనాన్ని అంబులెన్స్‌గా మార్చి ఉచితంగా సేవలు అందిస్తున్నారు. ఆసుపత్రులకు వెళ్లే రోగుల రాకపోకల కోసం ప్రత్యేకంగా ఆటోను ఏర్పాటు చేసి ఉచిత సేవలు అందిస్తున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో రక్షిత మంచినీటి సౌకర్యం లేని ప్రాంతాల్లో సొంత నిధులతో పైప్‌లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఆర్థిక సహాయం అందించారు. రాజవొమ్మంగి సహా పలు ప్రాంతాల్లో బస్ షెల్టర్ల నిర్మాణానికి సొంత నిధులు వెచ్చించారు. గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు కూడా ఆర్థిక సహాయం అందిస్తూ తన వంతు సేవ చేస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందుకున్న మఠం విజయభాస్కర్‌ను నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు అభినందించారు.



# 21న యథావిధిగా పీజీఆర్ఎస్--రెవెన్యూ క్లినిక్

## ప్రజల నుంచి అర్జీల స్వీకరణ.. ఉద్యోగుల గ్రీవెన్స్‌కు ప్రత్యేక సమయం

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబరు 20:** ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో భాగంగా సెప్టెంబరు 21న సోమవారం పీజీఆర్ఎస్--రెవెన్యూ క్లినిక్‌ను యథావిధిగా నిర్వహించనున్నట్లు పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ తెలిపారు. రంపచోడవరంలోని స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.తహాశీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర సంబంధిత జిల్లా అధికారులు క్లినిక్‌కు హాజరై ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని జేసీ తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన పూర్తి వివరాలతో పాటు అర్హత కలిగిన పత్రాలను జతచేసి అర్జీలు సమర్పించాలని సూచించారు.

**ఉద్యోగుల గ్రీవెన్స్‌కు ప్రత్యేక సమయం**

ప్రతి సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఉద్యోగుల సమస్యలు, ఫిర్యాదులను కూడా స్వీకరించనున్నట్లు తెలిపారు. పీజీఆర్ఎస్‌కు నేరుగా హాజరుకాలేని వారు 1100 టోల్‌ఫ్రీ నంబర్, 'మీకోసం' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చున్నారు. ఇప్పటికే సమర్పించిన అర్జీల పరిష్కార స్థితి, పురోగతిని కూడా 1100 ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.

వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009 ద్వారా 300కు పైగా పౌర సేవలు అందుబాటులో ఉన్నాయని జేసీ పేర్కొన్నారు. ప్రజలు అందుబాటులో ఉన్న ఈ సేవలను వినియోగించుకుని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని కోరారు.

**క్యూఆర్ కోడ్‌తో అభిప్రాయాలు**

పీజీఆర్ఎస్ సేవలను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందించేందుకు జిల్లా, మండల స్థాయి కేంద్రాల్లో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచుతున్నట్లు జేసీ తెలిపారు. సేవలు పొందిన అనంతరం మొబైల్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అనుభవం, అభిప్రాయాలను నమోదు చేయాలని ప్రజలకు సూచించారు.



# ఆర్టీసీ డిపోలో స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 20:** స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపోలో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.తూర్పుగోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎమ్ యూ వి మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కె. మాధవ్‌తో పాటు గ్యారేజీ, ట్రాఫిక్, కార్యాలయ, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డి పి టి వో మనోహర్ డిపో పరిసరా లను సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. డిపో ఆవరణలో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించి, పరిసరాలను పరిశు భ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టారు. పారిశుద్ధ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రజలు, ఉద్యోగులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకర వాతావరణాన్ని ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, కార్యాలయం, పని ప్రదేశంతో పాటు చుట్టుపక్కల పరిసరాలను క్రమం తప్పకుండా శుభ్రపరచుకోవాలని ఆయన సూచించారు. పారిశుద్ధ్యం ప్రతిరోజూ పాటించాల్సిన బాధ్యతగా భావించాలని, పరిశుభ్రమైన వాతావరణం ఉద్యోగుల ఆరోగ్యానికి, ప్రయాణికుల సౌకర్యానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు.

# నేడు రూరల్ నియోజక వర్గంలో రూ.22.48 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 20:** రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలో సోమవారం రూ. 22.48 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు స్థానిక ప్రజా ప్రతినిధులు శ్రీకారం చుట్టనున్నారు.జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతి నిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనను న్నారు.సాస్కి నిధులతో రూ. 21.18 కోట్ల నిధులతో రహదారులు, వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. పిడింగొ య్యి పంచాయతీ బుచ్చయ్య నగర్‌లో రూ. 1.30 కోట్లతో రహదారుల పనులకు శంకుస్థాపన చేస్తారు. కడియం మండలం పొట్టిలంక గ్రామంలో రూ. 4.88 కోట్లతో వంతెనకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.30 కోట్లతో నిర్మించిన పొట్టిలంక వెల్నెస్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తారు.

కడియం మండలం కడియపులంక గ్రామంలో శాస్కి నిధులు రూ. 7.50 కోట్లతో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. మాధవరాయు డుపాలెం గ్రామంలో రూ. 7.50 కోట్లతో రహదారుల పనులకు శంకుస్థాపన చేయనున్నారు.?

# ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా షేక్ ఫయాజ్ భాష ఏకగ్రీవ ఎన్నిక



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబరు 20:** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా పోలవరం జిల్లాకు చెందిన షేక్ ఫయాజ్ భాష (జిలాని) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఆదివారం నిర్వహించిన 18వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం అనంతరం జరిగిన ఆరో రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో ఆయనను ఈ పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.రాష్ట్రంలోని 28 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు రెవెన్యూ ఉద్యోగులు ఈ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం జరిగిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా చేబ్రోలు కృష్ణమూర్తి ఎన్నికయ్యారు.పోలవరం జిల్లా నుంచి హడాక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు షేక్ ఫయాజ్ భాష (జిలాని) నాయకత్వంలో ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఫయాజ్ భాష ఎన్నిక కావడంపై పోలవరం జిల్లా రెవెన్యూ ఉద్యోగులు, సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడహక్ కమిటీ సభ్యులు టి. లక్ష్మణరావు, పాల్ అలెగ్జాండర్, ఆర్. మహాలక్ష్మణరావుతో పాటు రెవెన్యూ ఉద్యోగులు రవీంద్ర, ప్రదీప్, చంటి, రాజు, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ఫయాజ్ భాషను అభినందించారు.

# సీసీఆర్‌టీ జాతీయ స్థాయి శిక్షణకు ముసురుమిల్లి ఉపాధ్యాయుడు ఎంపిక

## గిరిజన కళలు, సంస్కృతిని జాతీయ స్థాయిలో పరిచయం చేసే అవకాశం





**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 20:** పోలవరం జిల్లా పరిధిలోని ముసురుమిల్లి జీటీడబ్ల్యూఏహెచ్‌ఎస్ (బాలుర) పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా విధులు నిర్వహిస్తున్న బంధం రాజన్న దొర జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక శిక్షణా కార్యక్రమమైన సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ (సీసీఆర్‌టీ), న్యూఢిల్లీ శిక్షణకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన 20 మంది ఉపాధ్యాయుల్లో పోలవరం జిల్లా నుంచి బంధం రాజన్న దొర ఒక్కరే ఎంపిక కావడం విశేషంగా నిలిచింది.న్యూఢిల్లీలోని ద్వారక సెక్టార్--7లో ఉన్న సీసీఆర్‌టీ కేంద్రంలో నిర్వహించే ఈ శిక్షణలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులు పాల్గొంటారు. భారతదేశ కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ సంపద, జానపద కళలు, గిరిజన సంస్కృతి తదితర అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశంగా ఉంది.

**జాతీయ స్థాయిలో గిరిజన సంస్కృతికి పరిచయం**

ఈ శిక్షణలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గిరిజన కళలు, సంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వాన్ని ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు పరిచయం చేసే అవకాశం బంధం రాజన్న దొరకు లభించింది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనుల జీవన విధానం, ధింసా నృత్యం, సంప్రదాయాలు, స్థానిక కళలు, సాంస్కృతిక వారసత్వం గురించి వివరించనున్నారు.

తమ ప్రాంతానికి చెందిన కళలు, సంస్కృతి, సంప్రదాయాలను జాతీయ స్థాయిలో పరిచయం చేసే అవకాశం రావడం గర్వంగా ఉందని బంధం రాజన్న దొర తెలిపారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, అనుభవాలను విద్యార్థులకు అందించి, వారిలో మన రాష్ట్ర కళలు, సంస్కృతి, వారసత్వంపై మరింత అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

**అభినందనలు**

సీసీఆర్‌టీ శిక్షణకు బంధం రాజన్న దొర ఎంపిక కావడం పట్ల ముసురుమిల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. బాలరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. పోలవరం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్‌మూర్తి, రంపచోడవరం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ (గిరిజన సంక్షేమం), పీఎంఆర్‌సీ సిబ్బంది కూడా ఆయనను అభినందించారు.

గిరిజన ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడికి జాతీయ స్థాయి సాంస్కృతిక శిక్షణలో పాల్గొనే అవకాశం లభించడం ద్వారా పోలవరం జిల్లా, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల కళలు, సంస్కృతి, సంప్రదాయాలకు దేశవ్యాప్తంగా మరింత పరిచయం కలిగే అవకాశం ఏర్పడిందని పలువురు పేర్కొన్నారు.

# 70 వేల పలికిన గణేష్ లడ్డూ పాట



**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 20;** తాటియాకులగూడెం ఎస్సీ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం లడ్డూ ప్రసాదం వేలం నిర్వహించగా భక్తుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ వేలంలో లడ్డూ రూ. 70 వేల ధర పలికి భక్తుల చేత కైవసం చేసుకుంది. లడ్డూ వేలంలో గ్రామానికి చెందిన కడిమి సాయి, జాల వెంకటేశ్వరరావు, గంధం జయరాజు, గంధం పెద్ద వెంకటేశ్వరరావు, కోడెల్లి చిన్ని, కలపాల వెంకటేశ్వరరావు, నార్లపాటి పున్నయ్య పాల్గొని రూ. 70 వేలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. అనంతరం గ్రామంలో గణనాథుడిని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ ప్రత్యేకంగా ఊరేగింపు నిర్వహించారు. డప్పులు, భక్తిగీతాలు, నినాదాలతో గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. చిన్నారులు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం గణనాథుడికి వీడ్కోలు పలుకుతూ నిమజ్జన కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా విజయవంతంగా పూర్తి చేశారు.

# ప్రజల గొంతుకగా హ్యూమన్ రైట్స్ వాచ్ సారథి వినయ్ ప్రసాద్ మచ్చ...



**కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్ 20.** ఇకపై పోలవరం జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణకు కొత్త నాయకత్వం.కూనవరం మండలం కు చెంది న మచ్చ వినయ్ ప్రసాద్ ను హ్యూ మన్ రైట్స్ వాచ్ జిల్లా సెక్రటరీగా నియమిస్తూ సంస్థ డైరెక్టర్ బాలు అక్కిస నియమించారు.అన్యా యంపై ప్రశ్నించే గొంతుగా ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటామని నియామకం అనంతరం వినయ్ ప్రసాద్ తెలిపారు.గిరిజన ప్రాంతా ల్లో హక్కులపై అవగాహన,పోలీస్, రెవెన్యూ వ్యవస్థల్లో జరిగే అక్రమా లపై ఫిర్యాదుల స్వీకరణ,ఉచిత లీగల్ ఎయిడ్ అందించడం తన ప్రధాన బాధ్యతలని పేర్కొన్నారు. హ్యూమన్ రైట్స్ అంటే కేవలం పేరు కాదు.. ప్రతి పౌరుడికి న్యాయం అందించే వరకు పోరాటమని వినయ్ ప్రసాద్ అన్నారు.

# నైతిక విలువలతో ఏపీ విద్యావ్యవస్థను దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం



మంత్రి లోకేష్



**కాకినాడ రూరల్, పెన్ పవర్,సెప్టెంబర్ 20:** ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలు, సేవాభావం పెంపొందించడమే 'భారతీయం' కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాల ప్రాంగణంలో పాఠశాల విద్యాశాఖ, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ర్యాంకులు సాధించిన విద్యార్థుల ఫొటోలతో ప్రచారం నిర్వహించామని, ఈ ఏడాది 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని మంత్రి తెలిపారు. ఇంటర్మీడియట్‌లోనూ 10 వేల అడ్మిషన్లు పెరిగాయని చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.

**తరగతి గది నుంచే సమాజంలో మార్పు**

సమాజంలో మార్పు విద్య ద్వారానే సాధ్యమనే నమ్మకంతోనే విద్యాశాఖను ఎంచుకున్నానని లోకేష్ అన్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం విద్యార్థి కేంద్రంగా ఉండాలని తెలిపారు. తరగతి గది నుంచే సమాజంలో మార్పు ప్రారంభమవుతుందని, చిన్నతనం నుంచే పిల్లలకు చదువుతో పాటు క్రీడలు, నైతిక విలువలు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు.నైతిక విలువలు భారతీయ కుటుంబ వ్యవస్థకు పునాది అని, మానవత్వం మన వారసత్వమని అన్నారు. వైద్యంలో చరకుడు, రాజనీతిలో చాణక్యుడు, గణితంలో ఆర్యభట్ట, యోగాలో పతంజలి, ఆయుర్వేదంలో ధన్వంతరి వంటి మహనీయులు ప్రాచీన కాలంలోనే భారతీయుల ప్రతిభను ప్రపంచానికి చాటారని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

**పాఠశాలల్లో రాజకీయాలకు చోటు లేదు**

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా గత రెండేళ్లలో అనేక సంస్కరణలు చేపట్టామని మంత్రి తెలిపారు. తాను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' విధానాన్ని అమలు చేశామని చెప్పారు. యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూస్‌లో రాజకీయ పార్టీల రంగులు లేకుండా చర్యలు తీసుకున్నామని, పాఠశాలల్లో ముఖ్యమంత్రి లేదా తన ఫొటోలను ముద్రించలేదని తెలిపారు.

**సాంకేతికతకు భారతీయ విలువలు జోడించాలి**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలకు భారతీయ నైతిక విలువలు జోడించినప్పుడే ప్రపంచ స్థాయిలో విజయం సాధించగలమని లోకేష్ అన్నారు. సాంకేతికతను నిర్మాణాత్మకంగా ఉపయోగించుకోవడంతో పాటు మంచి, చెడును గుర్తించే ఆలోచనా శక్తిని విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.'అమ్మకు చెప్పలేని పని చేయొద్దు' అనే చాగంటి కోటేశ్వరరావు సందేశాన్ని విద్యార్థులు జీవితంలో ఆచరించాలని సూచించారు. దేశభక్తి, దైవభక్తి, పెద్దల పట్ల గౌరవం, మహిళల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

**త్యాగధనులే మనకు మార్గదర్శకులు**

దేశ స్వాతంత్ర్యం కోసం, సమాజం కోసం త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని మంత్రి సూచించారు. టంగుటూరి ప్రకాశం పంతులు, పొట్టి శ్రీరాములు వంటి త్యాగధనుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. సినిమాల్లో నటించే వారిని హీరోలుగా భావించడం కంటే దేశ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని కాపాడుతున్న సైనికులే నిజమైన హీరోలని పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధంలో సేవలందించిన మాజీ సైనికుడు డి. కిరణ్ కుమార్ ధైర్యసాహసాలను ప్రస్తావిస్తూ ఆయన సేవలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

**విజయానికి షార్ట్‌కట్ లేదు**

జీవితంలో విజయానికి షార్ట్‌కట్ ఉండదని, కష్టపడి పనిచేయడం ద్వారానే లక్ష్యాలను సాధించగలమని నారా లోకేష్ అన్నారు. 2019 ఎన్నికల్లో ఓటమి ఎదురైనా నిరుత్సాహపడకుండా ఐదేళ్లు ప్రజలకు దగ్గరగా పనిచేశానని, 2024లో మంగళగిరి నుంచి విజయం సాధించానని తన అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. 'ఫెయిల్'ను 'ఫస్ట్ అటెంప్ట్ ఇన్ లెర్నింగ్'గా భావించి వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని సూచించారు.

**సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి**

విద్యార్థులు చిన్నచిన్న సమస్యలకు కుంగిపోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని మంత్రి సూచించారు. మార్కులు తక్కువ రావడం లేదా అనుకున్న లక్ష్యం వెంటనే సాధించలేకపోవడం వంటి కారణాలతో తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పరిష్కారం కోసం సహాయం తీసుకోవాలని సూచించారు.తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలి తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి పిల్లలను చదివిస్తున్నారని, వారు తలదించుకునేలా కాకుండా తలెత్తుకునేలా విద్యార్థులు ఎదగాలని నారా లోకేష్ పిలుపునిచ్చారు. చదువు, క్రీడలు, కళలు తదితర ఏ రంగాన్ని ఎంచుకున్నా కష్టపడి పనిచేయాలని సూచించారు.చాగంటి కోటేశ్వరరావు నిరంతరం నేర్చుకుంటూ ఉండే నిత్య విద్యార్థి అని పేర్కొన్న లోకేష్, విద్యార్థులు కూడా జీవితాంతం నేర్చుకునే తత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. దేశభక్తి, దైవభక్తి, పెద్దల పట్ల గౌరవం, మహిళల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత వంటి విలువలతో ఎదిగితే విజేతలుగా నిలుస్తారని తెలిపారు.వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనలో విద్యార్థుల పాత్ర కీలకమని పేర్కొంటూ, తల్లిదండ్రులను ఎంతగా ప్రేమిస్తామో భారతదేశాన్ని కూడా అంతే ప్రేమించాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు.






# విభూది అలంకరణ లోగణపతి



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 20:**గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని స్వామివారికి పుసుపుతో ప్రత్యేక అలంకరణ చేసారు. కోఠీవారి అగ్రహారం వేంచేసియున్న శ్రీ భువనేశ్వరీ సమేత విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా రెండవ రోజు స్వామివారికి విభూది గణపతిగా విశేష అలంకరణ అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పూజాకార్యక్రమాలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేసారు.

# పెద్దాపురంలో టిడిపిలోకి భారీగా చేరికలు



**పెద్దాపురం.. పెన్ పవర్... సెప్టెంబర్ 20...**పెద్దాపురం పట్టణం నుండి పలువురు యువకులు పెదిరెడ్డి మైడిరాజు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పెద్దాపురం నియోజకవర్గం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి,మాజీ మున్సిపల్ రాజాసూరిబాబురాజు సమక్షంలో టిడిపిలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజప్ప అందరికి కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రంధి సత్యనారాయణ, మహ్మద్ అరీఫ్ అలీ, నూనె రామారవు, యాళ్ల వీరబాబు, శాస్త్రి, భార్గవ్, మట్టే శ్రీనివాస్, కొల్లి దుర్గప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కిర్లంపూడిలో ఘనంగా బాల వినాయకుడు 9 వ వార్షికోత్సవం.

- రమణయ్యపేటలో మండపం వద్ద భారీ అన్న సమారాధన.



**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్ 20:**కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రమణయ్యపేటలో దొడ్డి ముసలయ్య ఇంటి వద్ద ఏర్పాటు చేసిన బాల వినాయకుడి మండపంలో 9వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండపం వద్ద భారీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బాల వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు,గ్రామ ప్రజలకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.పెద్ద సంఖ్యలో భక్తులు,గ్రామస్థులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ బాల వినాయకుడి కృపాకటాక్షాలతో,గ్రామ ప్రజల సహాయ సహకారాలతో 9వ వార్షికోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,అన్నసంతర్పణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,నాయకులు పాల్గొని బాల వినాయక స్వామి వారిని దర్శంచికొని అన్న ప్రసాదములు స్వీకరించారు.

# పిఠాపురంలో డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన: కలెక్టర్ హరేంధిర ప్రసాద్





**కాకినాడ/పిఠాపురం, పెన్ పవర్,సెప్టెంబర్ 20:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఈ నెల 21, 22 తేదీల్లో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శనివారం పర్యటన ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి పర్యటించిన కలెక్టర్.. బహిరంగ సభ నిర్వహించే ప్రాంతంలో వేదిక, బ్యారికేడింగ్, స్టాళ్ల ఏర్పాటు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం ఎఫ్.కె.పాలెం, నాగులపల్లె గ్రామాల్లో సమగ్ర రక్షిత మంచినీటి పథకం ప్రారంభోత్సవానికి సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎస్. మల్లిబాబు,పాడా పీడీ శివరామ ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వచ్చే నెల 25న శ్రీ విజయ బేతాళ స్వామి వాహన ఉత్సవం



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 20:**వచ్చే నెల 25న శ్రీ విజయ బేతాళ స్వామి వారి వాహన ఉత్సవ సమావేశం ఆదివారం జరిగింది.ప్రతీ ఏటా విజయదశమి సందర్భంగా అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 25న శ్రీ విజయ బేతాళ స్వామి వారి వాహన ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షులు దొమ్మేటి వెంకట రామారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్య అర్జున మోహనరావు. సంఘ సభ్యులు తెలిపారు. అంబాజీపేట సంఘ కళ్యాణ మండపం భవనంలో 13 పాలాల సంఘ సమావేశం కార్యదర్శి మట్టపర్తి రాము అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో వచ్చే నెల1న బేతాళ స్వామి వారి ఆలయం పందిరి రాట ముహూర్తం చేయనున్నామన్నారు. 11న స్వామివారి కళశ స్థాపన జరుగుతుందన్నారు. ఉదయం 7 గంటలకు మాచవరం రామ్ ఘాట్ కౌశిక నుండి శ్రీ విజయభేతక స్వామి కలశను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకునిన స్థానిక పెద్ద వీధిలో ఉన్న బేతాళ స్వామి ఆలయం వద్ద స్థాపన చేస్తామన్నారు. కలశ స్థాపనకు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని శాంతియుత వాతావరణంలో విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాక్షుడు దొమ్మేటి శ్యామ్, గౌరవ అధ్యక్షులు బొంతు పెదబాబు, జాయింట్ సెక్రటరీ మట్టపర్తి సత్యనారాయణ, విత్తనాల ఇంద్రశేఖర్, దొమ్మేటి సత్యమోహన్, మట్టపర్తి సోమేశ్వరరావు, దొమ్మేటి సాయికృష్ణ, దంగేటి చిన్నబ్బులు, 13పాలాలకు చెందిన వాహన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ద్రాక్షారామం మార్కెట్ అగ్నిప్రమాద బాధితులకు రూ.21.50 లక్షల పరిహారం



**రామచంద్రపురం, పెన్ పవర్,సెప్టెంబర్ 20:** ద్రాక్షారామం కూరగాయల మార్కెట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో షాపులు కోల్పోయిన 41 మంది వ్యాపారులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో రూ.21.50 లక్షల పరిహారం అందజేశారు. ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున నగదు సాయం అందించారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సహకారంతో పాటు కాలిపోయిన షాపుల స్థానంలో నూతన షాపుల నిర్మాణం చేపట్టి, విద్యుత్, షెడ్లు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలను కల్పించారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కష్టకాలంలో బాధితులకు అండగా నిలవడం తన బాధ్యత అన్నారు. మార్కెట్‌లో అత్యవసర వాహనాలు రాకపోకలు సాగించేలా రోడ్ల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ రూ.80 లక్షల గ్రాంట్ మంజూరు చేయడం అభినందనీయమన్నారు. అలాగే ఇటీవల మృతి చెందిన వ్యాపారి సిరిగినీడి శ్రీనివాస్ కుటుంబానికి మార్కెట్ నిధుల నుంచి రూ.లక్ష, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ తరఫున రూ.50 వేలతో మొత్తం రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందించారు.కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, డీఎస్పీ ఎం.శేషు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, దాతలు, వ్యాపారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

